క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే బియ్యపు మధు ప్రచారం

రేణిగుంట: పట్టణంలో మంగళవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ తెలిపారు. ఉదయం వేణుగోపాలపురం శివాలయం వద్ద నుంచి ప్రచారం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. 16వ వార్డు శివకుమార్‌నగర్, 15వ వార్డు వడ్డిమిట్ట, 10, 11, 12, 13, 14, 15వ వార్డుల పరిధిలోని పాంచాలినగర్‌లో ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని తెలిపారు. పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు నూకతోటి నామినేషన్

●హాజరుకానున్న మంత్రి పెద్దిరెడ్డి



వరదయ్యపాళ్యం: సత్యవేడు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ మంగళవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. సోమవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు సత్యవేడులో వరదయపాళ్యం మార్గంలోని సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం అభిమానులు, పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీగా బయలుదేరి సత్యవేడు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని 10.30 గంటలకు నామినేషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి హాజరవుతున్నట్లు ఆయన వివరించారు. పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

సత్యవేడులో ఐదు నామినేషన్లు

సత్యవేడు: నాల్గవ రోజు అసెంబ్లీ స్థానానికి ఐదు సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయని రిటర్నింగ్ ఆఫీసర్ నరసింహులు తెలిపారు. టీడీపీ తరఫున కోనేటి ఆదిమూలం రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరఫున బాలగురవం బాబు, ఇండిపెండెంట్‌గా వేంపల్లి కృష్ణారావు, బహుజన సమాజ్ పార్టీ తరఫున సి.సుప్రియ బ్రాహ్మణ తంగాల్ గ్రామం, నారాయణవనం మండలానికి చెందిన మహిళ నామినేషన్ దాఖలు చేశారు.

కోలాహలం.. పొన్నియమ్మ తిరునాళ్ల

పిచ్చాటూరు: కారూరు గ్రామంలో ఆదివారం రాత్రి పొన్నియమ్మ తిరుణాళ్లు కోలాహలంగా నిర్వహించారు. రాత్రి అమ్మవారిని ట్రాక్టర్‌పై గ్రామంలో ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు పొంగళ్లు పెట్టి నివేదించారు.

మార్పు గురువుతోనే సాధ్యం



ఇందిరాంబను సన్మానిస్తున్న డీఈఓ శేఖర్

రేణిగుంట: గురువుతోనే సమాజంలో మార్పు సాధ్యమని డీఈవో శేఖర్ అన్నారు. మండలంలోని గుత్తివారిపల్లె హైస్కూల్‌లో సోమవారం జరిగిన హెచ్‌ఎం ఇందిరాంబ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ ఇందిరాంబ సేవలను కొనియాడారు. ఆమెను సత్కరించారు. ఎంఈవో ఇందిరాదేవి, ఎంఈవో–2 రంగనాథ్, సర్పంచ్ మంజులతదితరులు పాల్గొన్నారు.

వేడుకగా వినాయకుని ప్రతిష్ట





పిచ్చాటూరు: మండలంలోని గోవర్ధనగిరి లో శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయ కుంభాభిషేకంలో భాగంగా ఉదయం ప్రాణ ప్రతిష్ట వేడుకగా జరిగింది. ఉద యం 6 గంటలకు మహాకుంభాభిషేకం, ప్రాణప్రతిష్ట, నైవేద్యం, మహా హారతి నిర్వహించారు.

నిర్భయంగా ఓటు వేయండి



ఏర్పేడు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని రేణిగుంట డీఎస్పీ భవ్యకిషోర్ అన్నారు. సోమవారం మండలంలోని పల్లంపేటలో ఓటు హక్కుపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు సీఐ శ్రీరామశ్రీనివాసులు, ఎస్ఐ జిలానీ,ఏఎస్ఐ జగన్మోహన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రావణాసురుడుపై అగస్త్యేశ్వరుడు

నారాయణవనం: మండలంలోని సముదాయంలో టీటీడీ అనుబంధ మరగదవల్లీ సమేత అగస్తీశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో సోమవారం రాత్రి పరమభక్తుడైన రావణాసురుడిని వాహనంగా చేసుకుని గ్రామోత్సవంలో అగస్తీశ్వరస్వామి భక్తుల నుంచి హారతులు అందుకున్నారు.

సర్కారు వారి బడంటే ఇది కదా..



తులసి



నీలిమ



యోగేష్



జలజ



మునిలాస్య



అనిత



దయానా



చంద్రిక

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి విద్యాశాఖ పరిధిలో 22 ప్రభుత్వ పాఠశాలల్లో 92.8 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పట్టణంలోని జయరాంరావువీధి మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.లక్ష్మిప్రియ 596 మార్కులతో మండలంలో ప్రథమస్థానంలో నిలవడమే కాక జిల్లాస్థాయిలోను టాపర్‌గా నిలిచింది. కాసాగార్డెన్‌లోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థిని కె.తులసి 589 మార్కులతో అర్బన్ మండల పరిధిలో రెండవ స్థానంలో నిలవగా పట్టణంలోని ఆర్‌బీఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థిని వి.నీలిమ 588 మార్కులు సాధించి అర్బన్ పరిధిలో తృతీయ స్థానం సాధించింది. అర్బన్ మండలం పరిధిలో ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కాసాగార్డెన్, ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, రాజీవ్‌నగర్ పాఠశాలలు వంద శాతం ఫలితాలు సాధించాయి.

శ్రీకాళహస్తి మండలంలో....

మండలంలోని తొండమనాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థి జి.యోగేష్ 590 మార్కులు సాధించి మండల స్థాయిలో మొదటి స్థానం సాధించాడు. ముచ్చివోలు ఉన్నత పాఠశాల విద్యార్థిని జి.జలజ 567 మార్కులతో ద్వితీయ స్థానం, ఎగువవీధి ఉన్నత పాఠశాల విద్యార్థిని పి.మునిలాస్య 565 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు.

తొట్టంబేడు మండలంలో..

తొట్టంబేడు మండలంలో పదోతరగతి ఫలితాల్లో బోనుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.అనిత 565 మార్కులు సాధించి మండల స్థాయిలో మొదటి స్థానం సాధించింది. పెద్దకన్నలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని వై.దయానా 560 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలవగా, బోనుపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థిని పి.చంద్రిక 567 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచింది.

రేణిగుంటలో.. రేణిగుంట: పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో రేణిగుంట మండల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎంఈవో ఇందిరాదేవి వివరాలను వెల్లడించారు. మండలంలో 11 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు సంబంధించి 573మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 474మంది ఉత్తీర్ణులై 82.71శాతం ఉత్తీర్ణతను నమోదు చేసినట్లు తెలిపారు. రేణిగుంట ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్లో 55మందికి గాను, 47మంది, అన్నాసామిపల్లె హైస్కూల్లో 15మందికి గాను 12మంది, గుత్తివారిపల్లె హైస్కూల్‌లో 29మందికి గాను 24 మంది, కరకంబాడి హైస్కూల్‌లో 110మంది మందికి గాను 78మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. రేణిగుంట బాలుర ఉన్నత పాఠశాలలో 79మందికి గాను, 65మంది పాసై 82.28 శాతం, రేణిగుంట బాలికోన్నత పాఠశాలలో 116 మందికి గాను, 98మంది, గాజులమండ్యం హైస్కూల్‌లో 22మందికి గాను 16మంది, ఆర్.మల్లవరం హైస్కూల్లో 74మందికి గాను 71మంది ఉత్తీర్ణులై 95.95 శాతం, తారకరామానగర్ హైస్కూల్లో 32 మందికి గాను 28మంది పాసై 87.60శాతం, రేణిగుంట పీఎం హైస్కూల్లో 11మందికి గాను 11మంది ఉత్తీర్ణులై 100శాతం, ఆర్‌సీఎం హైస్కూల్‌లో 30మందికి గాను 24మంది ఉత్తీర్ణులై 80శాతం ఉత్తీర్ణతను సాధించినట్లు ఆమె వివరించారు. రేణిగుంట బాలికోన్నత పాఠశాలకు చెందిన ఎస్.సుమియా 583 మార్కులతో మండల స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. అలాగే అదే పాఠశాలకు చెందిన అరగొండ జీవని 581 మార్కులతో మండల స్థాయిలో ద్వితీయ స్థానం, 580 మార్కులతో బాలికోన్నత పాఠశాలకు చెందిన సానియా ఫాతిమా, తారకరామానగర్ హైస్కూల్‌కు చెందిన సి.అలీషా తృతీయ స్థానంలో నిలిచారు.

ఏర్పేడు మండలంలో 89.64 శాతం ఉత్తీర్ణత

ఏర్పేడు: మండలంలో పదవ తరగతి పరీక్షల్లో 89.64 శాతం విద్యార్థులు ఉత్తీర్ణతను సాధించినట్లు ఎంఈఓ–2 దయాకర్ తెలిపారు. మండలంలోని పాపానాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 79 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 72 మంది మంది ఉత్తీర్ణతను సాధించి 91.13 శాతం, బండారుపల్లెలో 26 మందికిగాను 25 మంది 86.15 శాతం, కందాడులో 61 మందికిగాను 46 మంది 75.4 శాతం, మునగలపాళెంలో 50 మందికిగాను 48 మంది 96 శాతం, పల్లంలో 99 మందికిగాను 80 మంది 80.8శాతం, పంగూరులో 53 మందికిగాను 50 మంది 94.33 శాతం, ఏర్పేడులో 84 మందికిగాను 80 మంది 96.42 శాతం ఉత్తీర్ణతను సాధించారు. బండారుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని జనని 592 మార్కులు, తిరువళ్లూరు వెంకటమ్మ 584 మార్కులు, లోకేశ్వరి 578 మార్కులు, మునగలపాళెం పాఠశాలలో అప్సన 564 మార్కులు సాధించారు.



సుమియా



జీవని



జనని



వెంకటమ్మ



లోకేశ్వరి



అప్సన

మెరిసిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు



తల్లిదండ్రులు కుప్పయ్య, సంగీతతో చారుమతి





జ్యోత్స్నను అభినందిస్తున్న ఎంఈఓ సోమశేఖర్

పిచ్చాటూరు: పట్టణానికి చెందిన కె.చారుమతి పదవ తరగతిలో 590 మార్కులు సాధించి శభాష్ అనిపించుకుంది. చారుమతి తండ్రి ఎం.కుప్పయ్య నింద్ర మండలంలో వీఆర్ఓగా పనిచేస్తున్నారు. తల్లి సంగీత గృహిణిగా ఉన్నారు. కుప్పయ్య, సంగీత ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు, విద్యను అందిస్తుండడాన్ని గుర్తించి తమ కుమార్తెను కేవీబీ పురంలోని ఏపీ మోడల్ స్కూల్లో చేర్పించి చదివించారు. ఈ సందర్భంగా చారుమతి మాట్లాడుతూ తాను కలెక్టర్ కావాలన్నదే ధ్యేయంగా కష్టపడి చదువుతానని తెలిపింది. మా పాఠశాలలో జగనన్న ప్రభుత్వం డిజిటల్ క్లాసులు, అన్ని రకాల వసతులు, టీచర్లు పాఠాలు చక్కగా చెప్పడం వల్లే ఇన్ని మార్కులు సాధించగలిగానని తెలిపింది.

93 శాతం ఉత్తీర్ణత

మండలంలో ప్రభుత్వ పాఠశాలలు 93 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ హేమమాలిని తెలిపారు. పిచ్చాటూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన సోమశేఖర్ 579 మార్కులు, వెంగళత్తూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన జ్యోత్స్న 579 మార్కులు సాధించి మండల టాపర్‌లుగా నిలిచారు. రజానగరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని సి.మానస 568, పిచ్చాటూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థి మదన్ 560, మేఘల 543, పులికుంద్రం జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని 558 మార్కులు సాధించి సత్తా చాటారు.

వరదయ్యపాళెం: మండలంలోని ఆరు ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 284 మంది పది పరీక్షలకు హాజరు కాగా 256 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ సరస్వతి తెలిపారు. వరదయ్యపాళెం హైస్కూల్‌లో 149 మందికిగాను 139 మంది ఉత్తీర్ణత సాధించారు. మండలంలో అత్యుత్తమంగా ఆ పాఠశాల నిలిచింది. మండల టాపర్‌గా వరదయ్యపాళెం హైస్కూల్‌కు చెందిన బి. పల్లవి (589), ఆర్‌కే కస్తూరి (572), కె. రమ్యశ్రీ (567), ఆర్‌కే అనూష (567) మార్కులు సాధించి సత్తా చాటారు.

నారాయణవనం: నారాయణవనం మండలంలోని నాలుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 350 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 80.5 శాతంతో 282 మంది ఉతీర్ణత సాధించారని ఎంఈఓ–1 ప్రభాకర్‌రాజు తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ నారాయణవనం బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు కస్తూరి(590), తాఫియ(589), సోనియా(561) మార్కులతో, పాలమంగళం ఉన్నత పాఠశాల విద్యార్థులు కుసుమాంజలి (585), కిషోర్ (581), హిమశ్రీ (575), నారాయణవనం బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు తొనియ(566), ముకేష్(555), లోకేశ్వరి(553) తొలి మూడు స్థానాలలో నిలిచారని ఆయన తెలిపారు. మండల టాపర్లుగా నిలిచిన కస్తూరి, తాఫియ, కుసుమాంజలిని ప్రభాకర్‌రాజు, హెచ్‌ఎంలు శశికల, సులోచన, మనోహరి, ధనంజయనాయుడు అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఫలితాలు రావడంపై హర్షం వ్యక్తం అయింది.



బి. పల్లవి ఆర్కే కస్తూరి అనూష రమ్యశ్రీ కస్తూరి తాఫియ, కుసుమాంజలి

నాగలాపురంలో 96శాతం ఉత్తీర్ణత



తేజేశ్వర్

నాగలాపురం: పది ఫలితాల్లో నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. మండలంలో 328 మంది విద్యార్థులకు 314 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 96 శాతం విద్యార్థులు పాసయ్యారని ఎంఈఓలు బాబయ్య, జనార్దనరాజు తెలిపారు. అందులో నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు 99 మందికి విద్యార్థులకుగాను 97మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 15 మంది 500లకు పైచిలుకు మార్కులను సాధించారని హెచ్‌ఎం కస్తూరయ్య తెలిపారు. పాఠశాల టాపర్‌గా ఎం.తేజేశ్వర్ 576, కె.సింధూజ..565, సి.చార్మి 556 మార్కులు సాధించారని అన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.


గురుకుల పాఠశాల విద్యార్థిని ప్రతిభ



రమ్యశ్రీ

సత్యవేడు: మండలలోని ప్రభుత్వ, గురుకుల పాఠశాలల్లో పది ఫలితాల్లో టాపర్‌గా అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని వై.రమ్యశ్రీ 583 మార్కులు పొంది టాపర్‌గా నిలిచింది. బాలికల, బాలుర గురుకుల పాఠశాల, మాధనపాళెం జెడ్పీ హైస్కూల్, పీవీ పురం జెడ్పీ హైస్కూల్ 100శాతం ఫలితాలు సాధించాయి. ప్రభుత్వ పాఠశాలల పరిధిలో బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్.వినిత (569), బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి జి.గణేశ్((564), జెడ్పీ ఉన్నత పాఠశాలల పరిధిలో రాజగోపాలపురం విద్యార్థిని మన్నిత(563), మాధనపాళెంలో బి.కీర్తన, ఇరుగుళంలో వై. యామిని(536), పీవిపురంలో కె. కౌసల్య(523), దాసుకుప్పంలో యూ. కీర్తన(518) ఆయా పాఠశాలల పరిధిలో టాపర్లుగా నిలిచారు.

పేదింట విద్యాకుసుమం



తల్లిదండ్రులతో గణేశ్

సత్యవేడు: బాలుర ఉన్నత పాఠశాలలో చదివిన నిరుపేద దళిత కుటుంబానికి చెందిన జి.గణేశ్ 564 సాధించాడు. సోమవారం విడుదలైన పది ఫలితాల్లో సత్యవేడుకు చెందిన జీ.రవిచంద్ర, లలిత దంపతుల కుమారుడు జి.గణేష్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో టాపర్‌గా మార్కులు పొందాడు.

బీఎన్ కండ్రిగలో 93 శాతం ఉత్తీర్ణత



నవ్యను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



దయానా



ధనుష్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో 351 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయగా 327 మంది పాసైయ్యారని ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం తెలిపారు. దీంతో మొదటి సారిగా మండలంలో 93 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. మండలంలోని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని నవ్య 578 మార్కులు సాధించగా, బుచ్చినాయుడుకండ్రిగ పాఠశాల విద్యార్థిని దయానా 570, ధనుష్ 570 మార్కులు సాధించారు.

వైఎస్సార్ సీపీలోకి 70 టీడీపీ, జనసేన కుటుంబాలు

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన 70 టీడీపీ, జనసేన పార్టీల కుటుంబాల వారు సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ పట్టణ కార్యాలయం జరిగిన ఈ కార్యక్రమంలో వారికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కన్నయ్య, మస్తాన్, మహాబుని, రమీజా , సుబ్బమ్మ, కృష్ణవేణి, జ్ఞానమ్మ, వెంకటమ్మ, ఎల్లమ్మ, మంగమ్మ, రాజేంద్ర, రమణమ్మ, బుజ్జమ్మ తదితరులున్నారు. వారు మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పథకాలు, మదన్న నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేస్తామన్నారు. నాయకులు ఉన్నం వాసుదేవనాయుడు, షబ్బీర్‌బాషా, శివ, రమేష్, వెంకటయ్య, గోవిందస్వామి, షబ్బీర్, షామీర్, అరుణ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో పవిత్రారెడ్డి

వైఎస్సార్ సీపీలో చేరిక



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైఎస్సార్ సీపీలోకి వలసల జోరు మరింత ఊపందుకుంది. సోమవారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సమక్షంలో గంగలపూడికి చెందిన అక్కుపల్లి కృష్ణయ్య, ఆమందూరుకు చెందిన చామల రమణయ్య తమ అనుచరులతో పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో ఆ గ్రామాలకు చెందిన దయాకర్‌యాదవ్, జయరామయాదవ్, గంగయ్యయాదవ్, హరియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతో అన్ని వర్గాల సంక్షేమం



జగ్గరాజుపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సమన్యాయం జరిగిందని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలం జగ్గరాజుపల్లెలో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. గడప గడపకు వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా పవిత్రారెడ్డి మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా జగనన్న పాలనలో పథకాల లబ్ధి అందిందని తెలిపారు. అలాగే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ బియ్యపు మధుసూదన్‌రెడ్డి గతంలో ఎన్నడూ లేని విధంగా శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. కరోనా కష్టకాలంలో కొందరు నాయకులు ఎక్కడో పక్క రాష్ట్రంలో తలదాచుకుంటే ప్రజలకు అండగా నిలిచి ఆదుకున్న వ్యక్తి మన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాత్రమేనని గుర్తు చేశారు. ప్రజాసేవకుడైన బియ్యపు మధుసూదన్‌రెడ్డిని మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వయ్యాల కృష్ణారెడ్డి, మండల నాయకుడు బర్రె హేమభూషన్‌రెడ్డి, సర్పంచ్ మునెయ్య, నాయకులు హనుమంత్, కృష్ణయ్య, గున్నయ్య, మునికుమార్, గురవయ్య, నాగరాజరెడ్డి, నారాయణ, మణి, సునీల్, శివ, శీను, రవి, శ్రీనివాసులురెడ్డి, అంకయ్య, మునిరత్నం, మనోహర్‌రెడ్డి, గురునాథం, దిలీప్, ప్రమోద్, ప్రసాద్, రేపల్లె మల్లి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో పేదల సుభిక్షం



గాజులమండ్యం పంచాయతీ దేశమ్మనగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బియ్యపు శ్రీవాణిరెడ్డి

రేణిగుంట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదలు సుభిక్షంగా జీవిస్తున్నారని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి శ్రీవాణిరెడ్డి అన్నారు. రేణిగుంట మండలం గాజులమండ్యం పంచాయతీ దేశమ్మనగర్, ఏపీఐఐసీ క్వార్టర్స్, ఐటీబీ కాలనీ, గాజులమండ్యం శివాలయం వీధిల్లో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో కూడిన బుక్‌లెట్‌లను పంచుతూ ఓటర్లకు వివరించారు. జగనన్న పాలనలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం దేశంలో మరే రాష్ట్రంలోనూ అమలు కాలేదని, పేదరిక నిర్మూలనే ధ్యేయంగా రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా పథకాలు అందాయని గుర్తు చేశారు. శ్రీకాళహస్తిని అభివృద్ధిపథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకుంటే మరింత అభివృద్ధి చేస్తారని తెలిపారు. ఎంపీపీ కలపాటి హరిప్రసాద్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సంధ్యారాణి, పార్టీ మండల అధ్యక్షుడు, సర్పంచ్ గంగారి రమేష్, ఎంపీటీసీ సభ్యులు జువ్వల ధనంజయరెడ్డి, వెంకటరమణారెడ్డి, పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి జువ్వల దయాకర్‌రెడ్డి, ధనకుమార్‌రెడ్డి, విజయకుమార్, కేశవులు, జగదీష్, వేణుగోపాల్‌రెడ్డి, సుందరవేలు, హరి, రాము, సుబ్బారెడ్డి, ధనంజయరెడ్డి, బెనర్జీ, రాజా, ఎంపీటీసీలు, సర్పంచులు, పలువురు మండల నాయకులు పాల్గొన్నారు.

ఆలయ ప్రతిష్టను దిగజార్చితే ఊరుకోం



మాట్లాడుతున్న చైర్మన్ అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: ఆలయ కీర్తి ప్రతిష్టలను దిగజార్చే విధంగా టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్ అసత్య ప్రచారం చేయడం బాధాకరమని, శ్రీకాళహస్తీశ్వరుడు సజీవ దేవుడని ఆయన వద్ద ఎవరి ఆటలు సాగవని దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు హితవు పలికారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆలయంలో ఇపుడు భద్రత చాలా పటిష్టంగా ఉందని, చిన్న పిన్ను గడప దాటాలన్నా అధికారులు, ఎస్పీఎఫ్ బలగాలు, సీసీ కెమెరాలు వంటి నిఘా ఉందన్నారు. ఎవరో దారిన పోయేవాడు వచ్చి ఆలయంపై ఆరోపణలు చేస్తే సహించబోమన్నారు. ఆలయంలో ప్రత్యేకమైన స్ట్రాంగ్ రూమ్‌లో దాతలు ద్వారా వచ్చిన కానుకలు, రాహుకేతు పూజల్లో వచ్చిన వెండిని భద్రపరుస్తామని, అది పక్కాగా గణాంకాల్లో నమోదు చేస్తామని పేర్కొన్నారు. గుడి ముందుకు వచ్చి ప్లకార్డులు పట్టుకుని వెండి అమ్ముకున్నావని, వచ్చిన డబ్బులు వారికి వీరికి ఇచ్చామని అవాస్తవ ఆరోపణలు చేస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆలయ ప్రతిష్ట దిగజార్చేవిధంగా ఎవరు మాట్లాడినా, ఆలయంలో ఎవరూ పనిచేయకపోయినా చర్యలు తప్పవన్నారు. ఏ సమయంలో వెండిపోయిందో చెబితే ఆ సమయంలోని రికార్డులు అందరి సమక్షంలో పరిశీలిస్తామని తెలిపారు. నిజాలు బయటకు వస్తే ఆరోపణలు చేసిన వారు తలలు ఎక్కడ పెట్టుకుంటారని ఎద్దేవా చేశారు. హేమంత్‌రెడ్డి అనే అతను ఎమ్మెల్యేపై దుష్ప్రచారం చేసేందుకు టీడీపీ వారు పంపిన ఆయుధమని, అది తిరిగి వారినే గాయపరిచే సమయం దగ్గర్లోనే ఉందన్నారు. అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బొజ్జల సుధీర్‌రెడ్డి విలేకరుల ముందు ఆవేశంగా మాట్లాడడం బాధాకరమన్నారు. రాజకీయాల్లో ప్రత్యర్థులే కాని శత్రువులు ఉండరని తెలుసుకోలేక పోతున్నారని, రాజకీయ పరిజ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని తెలిపారు. గెలుపును ఓటర్లు నిర్ణయిస్తారని, అది కూడా అతని సౌమ్యత, మాట తీరు, పరిపక్వతపై ప్రజలు నిర్ణయం తీసుకుంటారన్నారు. బొజ్జల సుధీర్‌రెడ్డికి అవేమి లేవని ఎద్దేవా చేశారు. 28 రోజుల తరువాత కథ చూస్తాను, అంతు చూస్తామని చెప్పడం అతని తీరు ఎవరికైనా ఇట్టే అర్థమవుతోందని తెలిపారు.

వేధింపులతో వలంటీర్లు మూకుమ్మడి రాజీనామా

ఏర్పేడు: టీడీపీ, జనసేన నాయకుల అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మండలంలోని తొమ్మిది మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. పెన్నగడం సచివాలయ పరిధిలోని కిరణ్, కోకిల, శారద, ముత్తు స్వచ్ఛందంగా తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి ప్రసన్నకుమార్‌కు అందజేశారు. అలాగే గుడిమల్లం సచివాలయ పరిధిలోని సుప్రియ కీర్తి, పవన్ కల్యాణ్, చంద్రప్రియ, యుగంధర్ తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి శివకు అందజేశారు. టీడీపీ అండ్ కో వలంటీర్ల సేవలపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు మనస్తాపం చెంది రాజీనామా చేసినట్లు వారు తెలిపారు. రానున్న ఎన్నికల్లో సీఎంగా జగనన్న, ఎమ్మెల్యేగా బియ్యపు మధుసూదన్‌రెడ్డి విజయం కోసం శక్తి వంచన లేకుండా పనిచేస్తామన్నారు. చంద్రబాబు వలంటీర్లకు రూ.10 వేలు ఇస్తామన్నా నమ్మే పరిస్థితి లేదని పేర్కొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచనపుత్తూరు, బీఎస్‌పురం, పుత్తేరి గ్రామాలకు చెందిన 16 మంది గ్రామ వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను సోమవారం ఎంపీడీఓ ప్రతాప్‌రెడ్డికి అందజేశారు. టీడీపీ, జనసేన నేతలు వలంటీర్లపై చేస్తున్న వ్యాఖ్యలకు నిరసనగా తామంతా రాజీనామా చేసి, రానున్న ఎన్నికల్లో జగనన్న విజయం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

నాగలాపురంలో..

నాగలాపురం: మండలంలోని కడివేడు పంచాయతీకి చెందిన ఆరుగురు వలంటీర్లు టీడీపీ, జనసేన వేధింపులతో తమ వలంటీర్ పదవికి రాజీనామా చేశారు. సోమవారం ఉదయం తమ రాజీనామా పత్రాన్ని ఎంపీడీఓ పీఎంకె బాబుకు అందజేశారు. వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి శాయశక్తులా కృషి చేస్తామని తెలిపారు.